ఉష్ణోగ్రత (అంచనా) 28-5-2025

	గరిష్టం	కనిష్టం
గుంటూరు	33	27
తెనాలి	32	27
నరసరావుపేట	33	27
బాపట్ల	33	28
రెంటచింతల	34	28
చీరాల	33	28

హలధారికి.. జలసిరి

- పథకం అమలుకు ప్రభుత్వం కసరత్తు
- మరో వారంలో విడుదల కానున్న మార్గదర్శకాలు
- కుసుమ్ పథకానికి అనుసంధానం చేసే దిశగా చర్యలు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు రూ.4 కోట్లు కేటాయించే అవకాశం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రైతులకు సాగునీటి కష్టాలు తీర్చే జలసిరి పథకాన్ని మళ్లీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. జలసిరి పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పేరు మార్చి ఓ ప్రహసనంగా మార్చి రైతులను ఇబ్బందులకు గురి చేసింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేసేలా జలసిరి పథకాన్ని పునరుద్ధరించింది. రైతుల అభీష్టానికి అనుగుణంగా ఎన్టీఆర్ జలసిరి పేరిట పథకాన్ని తిరిగి అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కూడా జరిగింది. పథకం అమలులో భాగంగా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఉచిత బోర్ల అవసరాలపై ప్రభుత్వం ఇప్పటికే అధికారుల నుంచి నివేదిక తీసుకుంది. నిధుల కేటాయింపులో భాగంగా మూడు జిల్లాల పరిధిలో తొలి విడతలో రూ.4కోట్లు కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వారంరోజుల్లో ఎన్టీఆర్ జలసిరి పథకం అమలుకు సంబంధించి పూర్తి స్పష్టత రానుందని అధికారులు చెబుతున్నారు. ఈ పథకాన్ని కేంద్ర ప్రాయోజిత పథకం కుసుమ్‌తో అనుసంధానం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. దీనిలో భాగంగా జలసిరి పథకానికి సోలార్ పంపుసెట్లకు అధిక ప్రాధాన్యమిచ్చేలా చూడాలనే ఆదేశాలు ఇప్పటికే ప్రభుత్వానికి వచ్చాయి. సోలార్ సౌకర్యం లేని చోట విద్యుత్ ఆధారితానికి వెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాల వారీగా తవ్వే ఉచిత బోర్లలో దాదాపు 40 శాతం సోలార్ ఆధారంగానే పనిచేసేలా చూడాలనే నిబంధనను ప్రభుత్వం తప్పనిసరి చేయనుంది.ఒక్కో యూనిట్‌కు కేంద్ర ప్రభుత్వం వాటా 40 శాతం కాగా రాష్ట్ర ప్రభుత్వం రాయితీ రూపంలో 30 శాతం భరించనుండగా మిగిలినది రైతు భరించేలా మార్గదర్శకాలు విడుదల కానున్నట్లు తెలుస్తోంది.

గతంలో 12,000 చేతిపంపులు

సాగునీరు సకాలంలో అందక పైర్లు ఎండిపోతున్న అంశాలను దృష్టిలో పెట్టుకుని చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం జలసిరి పథకాన్ని ప్రవేశపెట్టింది. వాల్టా చట్టం నిబంధనలను పాటిస్తూనే పొలాల్లో ఉచితంగా బోర్లు తవ్వించి విద్యుత్ కనెక్షన్ కూడా ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని అప్పట్లో ముమ్మరంగా చేపట్టింది. ఆ ఐదేళ్ల వ్యవధిలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.7 కోట్లు నిధులు ఖర్చుచేసి 12,000 మంది రైతుల ప్రయోజనాలను కాపాడింది. దీంతో సాగునీటి విషయంలో వరుణదేవుడి మీదనే ఆధారపడిన అవసరం లేకుండా రైతులు సాగు చేసుకునేవారు.



వైసీపీ నిర్లక్ష్యం

ఈ పథకం పేరును 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ వైఎస్సార్ జలకళగా మార్చింది. అయితే ఐదేళ్లలో కనీస స్థాయిలో కూడా ఆ పథకం అమలు చేయలేదు. నియోజకవర్గాల వారీగా రిగ్గులను కేటాయించడంతో సరిపెట్టింది తప్పితే నిర్దేశించుకున్న లక్ష్యాలపై దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. బాపట్ల జిల్లాలో 5,600 మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 770 బోర్లు, గుంటూరు జిల్లాలో 560 దరఖాస్తులకు 135, పల్నాడు జిల్లాలో 10,600 దరఖాస్తులకు 1,100 బోర్ల తవ్వకంతో సరిపెట్టింది. అరకొరగా తవ్విన బోర్లకు కూడా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో జాప్యం చేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఇందులో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ జరిపి నిజానిజాల నిగ్గు తేల్చడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.



రేషన్.. 1 నుంచి షాపుల్లోనే

- దుకాణాల వద్దే సరుకుల పంపిణీకి ఏర్పాట్లు
- ఇక ఎండీయూల కోసం పడిగాపులు అవసరం లేదు
- పంపిణీని ప్రారంభించనున్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- వృద్ధులు, అనారోగ్య పీడితులకు ఇళ్ల వద్ద పంపిణీకి ఆదేశాలు
- రేషన్ వాహనాల వ్యవస్థను రద్దు చేసిన ప్రభుత్వం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇక రేషన్ సరుకుల కోసం పడిగాపులు పడాల్సిన అవసరం లేదు. ఎప్పుడు రేషన్ వాహనం వస్తుందో తెలియక.. పనులకు వెళ్లలేక.. వెళ్తే ఆ నెలకు సరుకులు అందవేమోనని ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. ఎండలో.. వీధుల్లో.. రేషన్ సరుకులు తీసుకునేందుకు గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన దుస్థితి పోయినట్లే. కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీలో కూటమి ప్రభుత్వం మార్పులు చేసింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎండీయూ వ్యవస్థను రద్దు చేసింది. దీంతో ఇక నెల మొదటి 15 రోజుల్లో ఎప్పుడు తీరిక ఉంటే అప్పుడు వెళ్లి సరుకులు తెచ్చుకోవచ్చు. సెలవు పెట్టి ఇళ్ల వద్ద ఉండాల్సిన అవసరం లేకుండా పనులు, విధులు ముగించుకుని, వీలున్నప్పుడు వెళ్లి.. లేదంటే సెలవు రోజుల్లోనే గతంలో మాదిరిగా దుకాణానికి వెళ్లి సరుకులు తెచ్చుకునే అవకాశం మళ్లీ వచ్చేసింది. ఈ క్రమంలో 1వ తేదీ ఆదివారం నుంచి పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలోని రేషన్ దుకాణాల వద్దే సరుకులు పంపిణీకి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. 1వ తేదీ ఆదివారం రోజు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు రేషన్ షాపుల వద్ద సరుకుల పంపిణీ ప్రారంభించనున్నారు.

జరగని హేతుబద్ధీకరణ కష్టాలు

ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా రేషన్ దుకాణాల హేతుబద్ధీకరణ జరగలేదు. వాస్తవానికి ఒక్కో దుకాణం పరిధిలో 600 నుంచి 650 కార్డులు ఉండాలి. షాపులకు కార్డుల కేటాయింపు అస్తవ్యస్తంగా ఉంది. ఎక్కువ కార్డులున్న షాపుల్లోని కార్డులను తక్కువ ఉన్న వాటికి కేటాయించే ప్రక్రియ జరగలేదు. దీంతో కొన్ని షాపుల్లో 200 లోపు కార్డులు ఉంటే మరికొన్ని షాపుల్లో 1000 నుంచి 1500 వరకు కార్డులు ఉన్నాయి. దీంతో సరుకుల పంపిణీలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రేషన్ షాపులకు కార్డుల హేతుబద్ధీకరణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. కొన్ని షాపుల్లో కార్డులు అత్యధికంగా ఉండటంతో కార్డుదారులు సరుకులు తీసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు రానున్నాయి. కార్డుదారులు వీధిల్లోనే ఎండీయూల ద్వారా సరుకులు పంపిణీ చేయడంతో డీలర్ వద్ద కార్డులు ఎక్కువ, తక్కువ ఉన్నా ఇబ్బందులు తలెత్తలేదు. ఉదాహరణకు నరసరావుపేటలోని 368 నెంబరు షాపునకు 131 కార్డులు కేటాయిస్తే 427 నెంబరు షాపునకు 1148 కార్డులు కేటాయించారు. చిలకలూరిపేట పట్టణంలో 655 నెంబరు షాపులో 56 కార్డులు ఉంటే 696 నెంబరు షాపులో 1382 కార్డులు ఉన్నాయి. ఇదే పరిస్థితి గుంటూరు, బాపట్ల జిల్లాలతో పాటు పల్నాడు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ ఉంది. ఈ పరిస్థితుల్లో సరుకుల పంపిణీలో ఇబ్బందులు తలెత్తనున్నాయన్న అభిప్రాయాన్ని కార్డుదారులు వ్యక్తం చేస్తున్నారు.

సరుకుల పంపిణీ ఇలా..

ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాలను తెరిచి ఉంచాలని డీలర్లకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆయా రోజుల్లో ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు దుకాణాల వద్దే సరుకులు పంపిణీ చేయాలి. దుకాణం పరిధిలోని దివ్యాంగులు, అనారోగ్యం వల్ల మంచంపై ఉన్నవారు, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు సరుకులను వారి ఇంటి వద్దే డీలర్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

షాపులు.. కార్డులు

- గుంటూరు జిల్లాలో 972 రేషన్ షాపుల పరిధిలో 5,89,531 కార్డులు ఉన్నాయి. ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ పథకం కింద ఏఏవై కార్డులు 22,862, పీహెచ్‌హెచ్ కార్డులు 49,869, రాష్ట్ర ప్రభుత్వ పథకం కింద 512 ఏఏవై, పీహెచ్‌హెచ్ 4,05,072 కార్డులు ఉన్నాయి.
- పల్నాడు జిల్లాలో 6,34,893 కార్డులు ఉండగా వీటిలో జాతీయ ఆహార భద్రత పథకం(ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ) కింద అంత్యోదయ అన్న యోజన (ఏఏంవై) కార్డులు 28,898, ప్రాధాన్య గృహ (పీహెచ్‌హెచ్) కార్డులు 1,70,974 ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఏఏవై కార్డులు 646, పీహెచ్‌హెచ్ కార్డులు 4,34,375 కార్డులు ఉన్నాయి.
- బాపట్ల జిల్లాలో 1123 రేషన్ షాపులు పరిధిలో 4,76,529 కార్డులు ఉన్నాయి. ఏఏవై కార్డులు 20,784, పీహెచ్‌హెచ్ కార్డులు 45,876 ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ పథకం కింద ఏఏవై కార్డులు 453 ఉన్నాయి.



6

మహానాడు దృశ్యమాలిక

ఇసుక, బియ్యం రవాణాపై ఉక్కుపాదం

రొంపిచర్ల పీఎస్ తనిఖీలో ఎస్పీ శ్రీనివాసరావు


రొంపిచర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమంగా మద్యం, ఇసుక, గంజాయి, బియ్యం వంటివి రవాణా కాకుండా ఎక్కడికక్కడ ఉక్కుపాదం మోపాలని ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. రొంపిచర్ల పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనుమతి లేకుండా లాకప్‌లో ఎవ్వరినీ ఉంచవద్దని తెలిపారు. దర్యాప్తు కేసుల్లో సత్వరమే బాధితులకు న్యాయం చేయాలన్నారు. రాత్రి గస్తీ వెళ్లే సిబ్బందితో మాట్లాడుతూ దొంగతనాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది యోగక్షేమాల విషయంలో ఎటువంటి సమస్య ఉన్నా అందుబాటులో ఉంటానని ఎస్పీ తెలిపారు. అంతకముందు స్టేషన్‌లో సిబ్బంది పని తీరును పరిశీలించి, రిసెప్షన్‌లో రిజిష్టర్లను, లాకప్, స్టేషన్ పరిసరాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్‌బీ సీఐ సురేష్‌బాబు, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ మణికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

30 వరకే తాగునీటి విడుదల

- మరో రెండు రోజుల్లో సాగర్ గేట్లు బంద్
- 10 టీఎంసీలకు 4 టీఎంసీలకే ఆమోదం
- మరో 4 టీఎంసీల కోసం జలవనరులశాఖ వినతి
- ఇంతవరకు స్పందించని కేఆర్ఎంబీ వర్గాలు



బుగ్గవాగు నుంచి కుడికాలువకు నీటి సరఫరా

నరసరావుపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నుంచి తాగు నీటి అవసరాల కోసం కుడి కాల్వకు నీటి సరఫరా 30వ తేదీ వరకు మాత్రమే జరగనున్నది. ఆ తర్వాత డ్యాం నుంచి నీరు ఆగిపోనున్నది. ఈ నెల 22 నుంచి రోజూ 5,598 క్యూసెక్కులను డ్యాం నుంచి విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. 30వ తేదీ అర్ధరాత్రి వరకు నీటి విడుదల జరగనున్నది. ఆ తర్వాత జలాశయం గేట్లు బంద్ చేసి నీటి విడుదలను ఆపేయనున్నారు. కుడి కాల్వ పరిధిలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు తాగునీటి అవసరాల కోసం 10 టీఎంసీలు కేటాయించాలని జలవనరుల శాఖ కేఆర్ఎంబీని కోరింది. అయితే కేఆర్ఎంబీ 4 టీఎంసీల నీటిని మాత్రమే కేటాయించిన విషయం తెలిసిందే. కనీసం మరో 4 టీఎంసీలు కేటాయించాలని ఉన్నతాధికారులు కేఆర్ఎంబీని కోరారు. అదనపు కేటాయింపులపై మంగళవారం రాత్రి వరకు కేఆర్ఎంబీ వర్గాల నుంచి స్పందన రాలేదు. ఈ పరిస్థితుల్లో కుడి కాల్వ పరిధిలోని చెరువులను నింపుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ శాఖల అధికారులను ఎస్ఈ కృష్ణమోహన్ కోరారు. డ్యాం నుంచి 30న నీటి సరఫరా నిలిపివేసినా బుగ్గవాగు నుంచి మరో రెండు రోజులు సరఫరా జరిగే అవకాశం ఉంది. మేజర్ కాల్వ నుంచి మైనర్లు, సబ్ మైనర్లకు నీటి సరఫరా చేసే తూములకు షట్టర్లు లేకపోవడంతో తాగు నీరు వృథా అవుతోంది. వచ్చే సీజన్‌కు అయినా షట్టర్లు ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టేందుకు జలవనరుల శాఖ చర్యలు చేపట్టాలి.

బర్లీ పొగాకు మొత్తం కొనుగోలు చేయాలి

- ప్రభుత్వం కొన్నా రూ.50 కోట్లు దాటదు
- రైతు సంఘాల సమన్వయ సమితి నిరసన దీక్షలు



4

మాట్లాడుతున్న నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు

హడావుడిగా.. పునర్విభజన

- హెల్త్ అసిస్టెంట్ల రీడిప్లాయ్మెంట్‌లో వసూళ్లు
- మెయిల్‌లో రాత్రి ఆదేశాలు.. ఉదయం కౌన్సెలింగ్
- 22 ఏళ్లుగా ఒకే చోట ఉన్న వారిని తిరిగి కొనసాగింపు



గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం

గుంటూరు సిటీ, మే 27(ఆంధ్ర జ్యోతి): అవినీతి.. అక్రమాలు.. మూమూళ్లు ఇచ్చిన వారిని బదిలీ చేయకుండా కొనసాగింపు.. ఇదీ హెల్త్ అసిస్టెంట్ల(మేల్) పునర్విభజన(రీడిప్లాయ్మెంట్) ప్రక్రియ సాగిన తీరు. రీడిప్లాయ్మెంట్ ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు గుంటూరు వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి సోమవారం రాత్రి 9.30 గంటలకు ఆరోగ్య కేంద్రాలకు మెయిల్ పంపారు. కనీసం ఒక్క రోజు కూడా గడువు ఇవ్వకుండా హెల్త్ అసిస్టెంట్లను గుంటూరుకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఆరోగ్య శాఖ మంత్రి చెప్పిన మాటలకు ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు సమాధి కట్టారు. ముడుపులు ముట్టిన నేపథ్యంలోనే ఈ రీడిప్లాయ్మెంట్ ప్రక్రియలో సుమారు 70 మంది హెల్త్ అసిస్టెంట్ల పేర్లు లేకుండానే జాబితాను వెలువరించడం వివాదాస్పదమవు తుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న సుమారు 177 మంది హెల్త్ అసిస్టెంట్లను మలేరియా సంబంధిత పనుల్లో నియమించాలని నెల క్రితం రాష్ట్ర అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే అప్పటి నుంచి మౌనంగా ఉన్న జిల్లా అధికారులు సోమవారం రాత్రి నుంచి హడావిడి చేశారు.

వారి పేర్లు లేవు...

రెండేళ్ల క్రితం 143 జీవో పరిధిలోని హెల్త్ అసిస్టెంట్ల (మేల్) రీడిప్లాయ్మెంట్ ప్రక్రియ జరిగింది. అప్పట్లో జిల్లాకు చెందిన మంత్రి చెప్పారని సుమారు 40 మందికి పట్టణ ప్రాంతంలో పోస్టింగ్ ఇచ్చి గ్రామీణ ప్రాంతాల్లోని వారికి అన్యాయం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మలేరియా, ఫైలేరియా విభాగంలో పని చేసే సుమారు 70 మంది హెల్త్ అసిస్టెంట్లు పట్టణ ప్రాంతాల్లోనే పనిచేస్తూ వ్యాపారాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా జరిగిన రీడిప్లాయ్మెంట్‌లో కూడా ఆ 70 మంది పేర్లు లేకుండానే జాబితాను రూపొందించారని హెల్త్ అసిస్టెంట్లు ఆరోపిస్తున్నారు.

పలుమార్లు మార్పులు..

ఒకే రోజులో సీనియార్టీ జాబితాను గుంటూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలోని మినిస్టీరియల్ సిబ్బంది పలుమార్లు మార్పులు చేశారని సమాచారం. ఆ మార్పుల వల్ల మొదటి జాబితాలో 20వ స్థానంలో ఉన్న వ్యక్తి రెండో జాబితాలో 60వ స్థానంలోకి వెళ్లినట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో పెద్దమొత్తంలో నగదు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి.

రీడిప్లాయ్మెంట్‌ను రద్దు చేయాలి

హడావిడి రీడిప్లాయ్మెంట్‌లో అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు వచ్చాయి. ఇష్టానుసారంగా చేస్తే అభ్యర్థులు నేతల నుంచి ఒత్తిడి చేయిస్తారని ప్రస్తుతం వారు అందుబాటులో లేని సమయంలో హడావిడి చేశారు. కార్యాలయంలో జాబితా సక్రమంగా రూపొందించే సిబ్బందే లేరు. రీడిప్లాయ్మెంట్ ప్రక్రియలో కొందరిని ఎందుకు మినహాయించారో చెప్పాలి. ఈ ప్రక్రియను రద్దు చేసి పారదర్శకంగా చేపట్టాలి.



-ఎం భానుమూర్తి, తెలుగు నాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు

కన్నవాళ్లకు కన్నీళ్లే మిగిలింది

● వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు విద్యార్థుల మృతి ● వేసవి సెలవుల్లో సరదాగా ఉంటూ..అనంతలోకాలకు



విలపిస్తున్న బాలిక కుటుంబ సభ్యులు



విగత జీవిగా అంజనా బాయి



సాగర్(ఫైల్‌ఫొటో)

బెల్లంకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ట్రక్కు కింద పడి బాలిక మృతి చెందిన ఘటన మండలంలోని న్యూ చిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈ ఘటనలో న్యూ చిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌కు చెందిన ఆడావత్ సంజనా బాయి(14) మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు సంజనా బాయి అన్న వరసైన చెర్రితో ద్విచక్ర వాహనంపై మంచి నీరు తీసుకు రావడానికి బెల్లంకొండకు బయలు దేరింది. అదే సమయంలో మన్నె సుల్తాన్‌పాలెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ద్విచక్ర వాహనం వెనుక భాగాన సైకిల్, పశువుల మేతను పెట్టుకొని ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌కు వచ్చాడు. బైకు వెనుక భాగాన ఉన్న సైకిల్ సంజనా బాయి బండికి తగిలింది. దీంతో బాలిక చంద్రాజుపాలెం గ్రామం నుంచి మొక్క జొన్న లోడుతో బెల్లంకొండ వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు టైరు కింద పడి పోయింది. తలకు తీవ్ర గాయమై.. అక్కడికక్కడే బాలిక మృతి చెందింది. విషయం తెలుసుకున్న బాలిక తండ్రి అంజి నాయక్, తల్లి సైదమ్మ బాయి, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. అల్లారు ముద్దుగా పెంచానమ్మ.. మంచి నీటికి వెళ్లకుండా ఉంటే బ్రతికేదానివంటూ మృతదేహంపై పడి రోదించారు. ఈ ఘటన స్థానికులను కంట తడి పెట్టించింది. ఎస్ఐ ప్రవీణ్ కుమార్ అక్కడి చేరుకుని పరిశీలించారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంజనా బాయి నరసరావుపేటలో 9వ తరగతి చదువుతోంది.

వేసవి సెలవుల నిమిత్తం స్వగ్రామ మైన న్యూ చిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌కు వచ్చిందని బంధువులు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి..

అమరావతి, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి 9వ తరగతి విద్యార్థి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మునగోడు గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన నేలపాటి లింకన్ కుమారుడు సాగర్(14) స్థానిక హైస్కూల్‌లో చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో స్నేహితులతో కలసి అత్తలూరు రోడ్డులోని చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులోని నీటి కుంటలో జారిపడి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సాగర్ మృతదేహాన్ని బయటకు తీసి.. ఇంటికి తీసుకువచ్చారు. కూలి పనులు చేసుకుంటూ కుమారుడిని చదివించుకుంటున్న ఆ కుటుంబం శోక సముద్రంలో మునిగిపోయింది. విద్యార్థి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గత ప్రభుత్వ హయాంలో స్థానిక వైసీపీ నాయకులు అక్రమ గ్రావెల్ తవ్వకాలు చేపట్టడంతో ఈ నీటి కుంటలు ఏర్పడ్డాయి.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



కొనకంచి శ్రీనివారావు(ఫైల్)

మాచవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నెల్లి గ్రామ కౌలు రైతు.. అప్పుల బాధతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మాచవరం ఎస్ఐ ఎం.రోశయ్య తెలిపిన వివరాలు మేరకు.. పిన్నెల్లి గ్రామానికి చెందిన కొనకంచి శ్రీనివాసరావు(47) తన ఎకరం పొలంతో పాటు.. తమ్ముడు పొలం ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పంటలు పండితే ధర లేక, ధరలు ఉంటే దిగుబడి లేక.. సాగు కోసం సుమారు రూ.15 లక్షల వరకు అప్పులు చేశారు. బ్యాంకులో పంట రుణం రూ.1.50 లక్షలు, బంగారం రుణం రూ.2.50 లక్షలు తీసుకున్నారు. ఇలా అప్పులు పెరగడంతో.. అప్పు ఇచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేక ఉన్న ఎకరం పొలం రూ.13 లక్షలకు విక్రయించాడు. పొలం కొన్న వారు రూ.11 లక్షలు ఇచ్చారు. అయినా.. అప్పులు తీర లేదు. దీంతో మనో వేదనకు గురైన శ్రీనివాసరావు రాత్రి బయటకు వెళ్లి వస్తానంటూ చెప్పి బయటకు వెళ్లాడు. ఇంతలోనే గొర్రెల కాపరులు శ్రీనివాసరావు పొలంలో పురుగు మందు తాగి స్పృహ లేకుండా పడి పోయి ఉన్నాడని సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొనే సరికే మృతి చెంది ఉన్నాడు. భార్య అంజలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రోశయ్య కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి పిల్లలు ఉన్నారు.

తమ్ముడి కొడుకును చంపిన..
అన్నకు జీవిత ఖైదు

ఈపూరు, మే27(ఆంధ్రజ్యోతి): తమ్ముడి కొడుకు మీద పెట్రోలు పోసి నిప్పు అంటించి చావుకు కారణమైన ముద్దాయి నాశన పెదకొండయ్యకు జీవిత ఖైదు, రూ.10వేలు జరిమానా విధిస్తూ నరసరావుపేట 13వ అడిషనల్ జడ్జి కోర్టు మంగళవారం తీర్పు ఇచ్చిందని ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈపూరు మండలం కూచినపల్లికి చెందిన నాశన పెదకొండయ్య, చిన కొండయ్య అన్నదమ్ములు. ఆస్తి కోసం 2019 అక్టోబర్ 17న ఇద్దరూ గొడవపడ్డారు. గొడవ జరుగుతుండగా చిన కొండయ్య రెండవ కొడుకు రాకేష్ ఇద్దరికీ సర్ది చెప్పాడు. అయితే రాకేష్‌పై పెదకొండయ్య కక్ష పెంచుకున్నాడు. అదే రోజు రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న రాకేష్‌పై పెదకొండయ్య పెట్రోలు పోసి నిప్పు అంటించాడు. మంటల్లో చిక్కుకున్న రాకేష్ కేకలు వేయడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు మంటలు ఆర్పారు. నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. రాకేష్ మరణ వాంగ్మూలం ప్రకారం అప్పటి ఎస్ఐ ఐ.అస్సాన్ కేసు నమోదు చేశారు. వినుకొండరూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు విచారణ పూర్తి చేసి.. కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. వినుకొండ రూరల్ ప్రస్తుత సీఐ బి.ప్రభాకర్, ఈపూరు ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు సాక్ష్యాలను ప్రవేశపెట్టగా రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వరరావు, ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి వాదనలు వినిపించారు. ముద్దాయి నాశన పెదకొండయ్యకు జడ్జి ఎస్.సత్యశ్రీ 302 సెక్షన్ ప్రకారం జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

పంతులమ్మలా సిబ్బందికి ఎంపీడీవో పనిష్‌మెంట్

సమయపాలన పాటించని వారిని గేటు బయట నిలబెట్టిన వైనం

ప్రత్తిపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో శివ పార్వతి తీరు ఇటీవల ఉద్యోగులకు తలనొప్పిగా మారింది. అటు పంచాయతీ సెక్రటరీల నుండి ఇటు అన్ని శాఖల అధికారులల్లో కూడా ఆమె తీరు పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆ అసంతృప్తి ఇప్పుడు యోగా శిక్షణ కార్యక్రమంలో కూడా బయటపడింది. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో టీవోటీలకు నాలుగు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉదయం కొందరు మండల స్థాయి అధికారులతో పాటు సిబ్బంది ఆలస్యంగా శిక్షణకు హాజరయ్యారు. దీంతో ఎంపీడీఓ గేటు బయట కుర్చీ వేసుకుని కూర్చున్నారు. ఆలస్యంగా వచ్చే పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలతో పాటు ఇతర శాఖల అధికారులను బయటే నిలబెట్టేశారు. ఇంకా రాని మండల స్థాయి అధికారులపై జిల్లా అధికారులకు ఫోన్ చేసి, ఫిర్యాదు చేశారు. గేటు బయట అధికారులను నిలబెట్టడం ఇప్పుడు మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. స్కూలు పిల్లలను నిలబెట్టినట్లు తమను ఎంపీడీవో బయట నిలబెట్టడం ఏమిటంటూ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఉద్యోగులు అయితే సిగ్గుతో తలదించుకున్నామని చెప్తున్నారు.

రామకృష్ణకు డాక్టరేట్ ప్రదానం



రామకృష్ణకు పట్టా అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు

పెదకాకాని, మే 27(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని డిపార్ట్ మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో పరిశోధన చేసినందుకు పాలడుగు రామకృష్ణకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఇన్‌చార్జి కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. సుధాకర్ మంగళవారం తెలిపారు. ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె. గంగాధరరావు పర్యవేక్షణలో " టెక్స్ క్లస్టరింగ్ అండ్ డాక్యుమెంట్ క్లాసిఫికేషన్ టెక్నిక్స్ యూజింగ్ డీప్ కాంటెక్స్‌వల్ అండ్ ఎక్స్ టెన్ డెడ్ గ్లోవ్ మెథడ్ " అనే అంశంపై రామకృష్ణ పరిశోధన గ్రంథం సమర్పించారు. వీసీ చేతుల మీదుగా పట్టా అందుకున్నారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో..
ఏఎన్‌యూకు ర్యాంకులు

పెదకాకాని, మే 27(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ది వీక్ - హన్సా రీసెర్చ్ బెస్ట్ యూనివర్సిటీ సర్వే - 2025 ర్యాంకింగ్స్ విడుదల చేసింది. మల్టీ డిసిప్లినరీ వర్సిటీ కేటగిరిలో జాతీయస్థాయిలో ఏఎన్‌యూ 13, సౌత్ జోన్ స్థాయిలో 6, రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకులను కైవసం చేసుకుంది. మౌలిక వసతులు, మేధావులపై అధ్యాపకులు, పరిశోధన, అకడమిక్ ప్రోగ్రామ్స్, స్టూడెంట్ అడ్మిషన్స్, ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్, ప్లేస్మెంట్స్ ఆధారంగా ఈ ర్యాంకులను కేటాయించడం జరిగింది. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది కృషి వల్లే ఈ ర్యాంకులు వర్సిటీకి సాధ్యమైనట్లు తాత్కాలిక వీసీ ఆచార్య కె.గంగాధరరావు మంగళవారం తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ది టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్, యూకే ఆధ్వర్యంలో ప్రకటించిన ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్ - 2025లో ఏఎన్‌యూ అంతర్జాతీయంగా బ్యాండ్ 600 + ర్యాంక్‌ని సొంతం చేసుకుంది. అభ్యాసన వాతావరణం, పరిశోధన వాతావరణం, నాణ్యత, శ్రేష్ఠత, అంతర్జాతీయ దృక్పథం, పరిశ్రమలను పరిశీలించి ర్యాంక్ లను విడుదల చేసింది. రిజిస్ట్రార్ జి.సింహాచలం, డాక్టర్ రవి, ఆర్కిటెక్చర్ కళాశాల బోధనా సిబ్బంది ఉన్నారు.



ర్యాంకులు చూపుతున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు

బర్లీ పొగాకు మొత్తం కొనుగోలు చేయాలి

● ప్రభుత్వం కొన్నా రూ.50 కోట్లు దాటదు
● రైతు సంఘాల సమన్వయ సమితి నిరసన దీక్షలు

చిలకలూరిపేట, మే27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరు జిల్లాల పరిధిలో రైతుల నుండి నల్ల బర్లీ పొగాకును తక్షణం కొనుగోలు చేయాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు డిమాండ్ చేశారు. స్థానిక నరసరావుపేట రోడ్డులోని ఐటీసీ కంపెనీ ఎదుట మంగళవారం పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో నిరసన దీక్షలు జరిగాయి. దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం డాక్టర్ కొల్లా మాట్లాడుతూ మంత్రుల సమక్షంలో పొగాకు కంపెనీలు అంగీకరించిన విధంగా కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మూడుసార్లు కంపెనీలతో సమావేశాలు జరిగినా ఫలితాలు కనిపించలేదని పేర్కొన్నారు. రైతులకు కంపెనీలు గిట్టుబాటు ధర చెల్లించి, పొగాకును కొనుగోలు చేయని పక్షంలో ప్రభుత్వం పూనుకొని మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ఆయన కోరారు. పొగాకు బోర్డు పరిధిలోకి బర్లీ పొగాకును చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పొగాకు రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. రైతుల నుండి పొగాకు కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు. రైతు రుణ మాఫీ చేయమని ఎన్నిసార్లు విన్నవించినా.. కేంద్రానికి కార్పొరేట్ వ్యక్తుల మీద ఉన్న ప్రేమాభిమానాలు రైతులపై లేదని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు రు.60 లక్షల కోట్లు రుణమాఫీ సబ్సిడీలు ఇచ్చారని దుయ్యబట్టారు.

మొత్తం కొన్నా..రూ.50 కోట్లు దాటదు..

కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ కడపలో జరుగుతున్న మహానాడులో వ్యవసాయ పంటల ధరలపై తీర్మానం చేయాలన్నారు. పల్నాడు జిల్లాలో ఐదు వేల ఎకరాల్లో పొగాకు సాగు చేశారని, 50 వేల క్వింటాళ్ల పొగాకు పండిందన్నారు. ఈ మొత్తం ప్రభుత్వం కొనుగోలు చేసినా రూ.50 కోట్లు ఖర్చు దాటదన్నారు. జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఏపూరి గోపాలరావు, రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ జిల్లా సెక్రటరీ మారుతీ వరప్రసాద్, సుబాబుల్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమాన్ రెడ్డి, పలు రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ వ్యవసాయశాఖ మంత్రి ఎదుట అంగికరించిన విధంగా కంపెనీలు పొగాకును క్వింటా రూ.15 వేలకు తక్కువ కాకుండా కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పొగాకు కంపెనీలు, ప్రభుత్వం దిగివచ్చేంత వరకు ఉద్యమం చేస్తామని తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లా రైతులు అధిక సంఖ్యలో నిరసన దీక్షలో పాల్గొన్నారు. పలు సంఘాల నాయకులు నిరసన దీక్షలో పాల్గొన్నారు. పొగాకు రైతుల నిరసన దీక్ష బుధవారం కూడా కొనసాగుతుందని రైతు సంఘాల నేతలు ప్రకటించారు.



నిరసన దీక్షలో పాల్గొన్న రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు

తిరుపతికి కొత్త రైలు ప్రతిపాదించాం

● రైల్వేబోర్డు ఇంకా నిర్ణయం తీసుకోలేదు
● డీఆర్‌యూసీసీ సమావేశంలో గుంటూరు డీఆర్‌ఎం సుధేష్ణ సేన్



డీఆర్‌యూసీసీ సమావేశంలో పాల్గొన్న డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ - న్యూ పిడుగురాళ్ల - శావల్యాపురం మీదుగా తిరుపతికి ఒక కొత్త రైలు ప్రవేశపెట్టాలని రైల్వే బోర్డుకు ప్రతిపాదించామని గుంటూరు డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ తెలిపారు. మంగళవారం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్‌టేటివ్ కమిటీ(డీఆర్‌యూసీసీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ కొత్త రైలు ప్రతిపాదనపై ఇంకా రైల్వే బోర్డు నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. అలానే కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ని డైలీ సర్వీసు చేసేందుకు ఐఆర్‌టీటీసీకి ప్రతిపాదించామన్నారు. గుంటూరు - నంద్యాల సెక్షన్‌లో ఇంటర్‌సిటీ రైలుని నడిపే విషయాన్ని డబ్లింగ్ పనులు పూర్తి అయిన తర్వాత పరిశీలిస్తామని చెప్పారు. మంగళవారం నుంచి 17261/17262 గుంటూరు - తిరుపతి - గుంటూరు ఎక్స్‌ప్రెస్‌లకు నాలుగో జనరల్ బోగి జోడించినట్లు తెలిపారు. కరోనకు ముందు నిలిపేసిన రైళ్లన్నింటిని పట్టాలెక్కించామని, 56503/56504 బెంగళూరు కంటోన్మెంట్ - విజయవాడ - బెంగళూరు కంటోన్మెంట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మాత్రం దక్షిణ పశ్చిమ రైల్వే ఇంకా పునః ప్రారంభించలేదని తెలిపారు. గుంటూరు యార్డు రీమోడలింగ్ తర్వాత నంద్యాల వైపు నుంచి వచ్చే రైళ్లను జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కి కనెక్టింగ్ చేసే ప్రతిపాదనని పరిశీలిస్తామన్నారు.

కొత్త జడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడిగా నారాయణరెడ్డి..

జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్‌టేటివ్ కమిటీ నూతన సభ్యుడిగా డీఆర్‌యూసీసీ మెంబర్ జీవీ నారాయణరెడ్డిని సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సమావేశంలో రైల్వే సీనియర్ అధికారులు డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్, జె.శ్రీనాథ్, జేవీ అనూష, జి.సూర్యనారాయణ, నోయల్, రత్నాకర్, ఎం రవికిరణ్, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో
అక్రమ రుణాలపై సీబీఐ విచారణ జరపాలి

● డీసీసీబీ కార్యాలయం ఎదుట ఉద్యోగ సంఘాల నాయకుల నిరసన



బ్యాంకు ఎదుట నిరసన తెలియజేస్తూ నినాదాలు చేస్తున్న అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు

గుంటూరు, మే 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచీల్లో జరిగిన అక్రమ రుణాలపై సీబీఐతో విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీ సీసీబీఈఏ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.శివకృష్ణ డిమాండ్ చేశారు. అక్రమ రుణాలు పొందిన వారు, సహకరించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్యమేవ జయతే పేరుతో ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. తొలి రోజు మంగళవారం గుంటూరు బ్రాడీపేటలోని కేంద్ర సహకార బ్యాంకు ఎదుట ఉద్యోగులు బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో జిల్లాలోని ఏడు బ్రాంచీల పరిధిలోని సహకార సంఘాల ద్వారా కొందరు అక్రమార్కులు ఉద్దేశపూర్వకంగా నకిలీ పాస్ పుస్తకాలు, రెవెన్యూ రికార్డులు సృష్టించి, వాటితో రూ. 11 కోట్లు అక్రమ రుణాలు పొందినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగున్నరేళ్లుగా వీటిపై విచారణలు లేవన్నారు. పైగా మోసానికి బ్యాంకు ఉద్యోగులను సహకార అధికారులు సెక్షన్ 51 ప్రకారం విచారణ, నివేదిక పేరుతో అన్యాయంగా బాధ్యులను చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. వీటిపై అనేక దఫాలుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఫలితం లేకుండాపోయిందన్నారు. జిల్లా కార్యదర్శి రమేష్‌బాబురెడ్డి మాట్లాడుతూ ఈ నెల 31 వరకు ఉద్యోగులు బ్యాడ్జీలతో నిరసన చేస్తారని, జూన్ 2 నుంచి 5వ తేదీ వరకు బ్రాంచ్‌ల ఎదుట మధ్యాహ్నం నిరసన ప్రదర్శనలు, జూన్ 6న పెన్ డౌన్ కార్యక్రమం, 9న కేంద్ర కార్యాలయం ఎదుట ధర్నా, 10న గుంటూరు కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో అసోసియేషన్ ట్రెజరర్ పి.లక్ష్మీనారాయణ పలువురు నాయకులున్నారు.

కొండవీడుకోట ఘటనపై పోలీసుల విచారణ



సిబ్బందిని విచారిస్తున్న సీఐ సుబ్బానాయుడు, ఎస్ఐ

యడ్లపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన కొండవీడుకోటలో సోమవారం జరిగిన ఘటనపై చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు విచారణ చేపట్టారు. మంగళవారం యడ్లపాడు ఎస్ఐ శివరామకృష్ణతో కలసి కొండవీడుకోటకు వచ్చారు. గుంటూరుకు చెందిన పర్యాటకులు, అటవీ శాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మధ్య తలెత్తిన వివాదం.. ఘర్షణకు దారితీసిన ఘటనలపై విచారణ జరిపారు. టోల్‌గేట్ వద్ద ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, అటవీశాఖ సహాయ బీట్ అధికారితో మాట్లాడారు. ఘర్షణపై ఉద్యోగులను ఒక్కొకరిగా పిలిచి విచారించి, సంయమనంతో మెలగాలని హితవు పలికారు. అనంతరం సీఐ విలేకర్లతో మాట్లాడారు. సంయమనం పాటించకపోవడం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైనట్లు తెలిపారు. బాధిత పర్యాటకులతో.. మాట్లాడేందుకు ఉదయం నుంచి ప్రయత్నిస్తున్నామని..వారు కాంటాక్ట్‌లోకి రాలేదని చెప్పారు. వారితో కూడా మాట్లాడి పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. యడ్లపాడు ఎస్ఐకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి సమగ్రంగా దర్యాప్తు చేపడతామని సీఐ పేర్కొన్నారు. టోల్‌గేట్ వద్ద, ఘాట్ మార్గంలో, కొండపైన పోలీసు అధికారుల కాంటాక్ట్ నంబర్లను ప్రదర్శిస్తామని చెప్పారు. విలేకరులు పర్యాటకులు సీఐకు, 112కు ఫోన్‌చేసినా.. పోలీసులు స్పందించలేదన్న ఆరోపణలపై వివరణ కోరారు. తనకు ఎవరూ ఫోన్ చేయలేదని, యడ్లపాడు ఎస్ఐకు ఫోన్ చేయగా ఆయన వెంటనే పోలీసులను ఘటన స్థలానికి పంపించారని తెలిపారు. అయితే అప్పటికే గొడవ సర్దుమణిగిందని చెప్పారు. ఇక్కడ ఔట్ పోసు ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నామన్నారు. అలాగే ఇక్కడి ఔట్ సోర్సింగ్ సిబ్బందికి యూనిఫాం, ఐడీ కార్డులు లేవని చెప్పారు. డీఎఫ్‌వోతో మాట్లాడి యూనిఫాం, ఐడీ కార్డులతో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆందోళన

నరసరావుపేట టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట జేఎన్‌టీయూ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా తమను ఇబ్బంది పెడుతున్నారని విధులు బహిష్కరించి ప్రిన్సిపల్ గదిని ముట్టడించారు. ఎటువంటి ఇంటర్వ్యూలు లేకుండా రెన్యూవల్ చేయాలని, బ్రేక్ పీరియడ్ 15 నుంచి 5 రోజులకి తగ్గించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరగకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రేషన్ షాపుల వద్దనే నిత్యావసర సరుకుల పంపిణీ

క్రోసూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల వద్దనే నిత్యావసర సరుకులను వినియోగదారులకు అందజేస్తారని తహసీల్దార్ వేముల వెంకట నాగరాజు తెలియజేశారు. ఇప్పటివరకు ఉన్న ఎండీయూ వాహనాల పద్ధతిని ప్రభుత్వం రద్దు చేసినట్టు తెలిపారు. డీలర్ల ఇంటివద్దకు వెళ్లి రేషన్ కార్డుదారులు సరుకులను పొందవచ్చన్నారు. 65 సంవత్సరాలు నిండిన వారికి 5వ తేదీ లోపు డీలర్లు వారి ఇళ్ల వద్దకు వెళ్లి సరుకులను పంపిణీ చేస్తారని తెలిపారు.

నేడు పాపాయపాలెంలో వైద్యశిబిరం

బెల్లంకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలంలోని పాపాయపాలెంలో బుధవారం నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా కాటూరి హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు టీడీపీ నాయకులు సరిమెళ్ల కోటిరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని గ్రామస్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

జవహర్‌లాల్ నెహ్రూకి ఘన నివాళి

రెంటచింతల, మే 27(ఆంధ్రజ్యోతి): భారత ప్రప్రథమ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని మోడల్ స్కూల్, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు ర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ పాపారావు, మోహన్, ఎన్ శ్రీనివాసరావు, శ్రీను నాయక్, పుల్లారెడ్డి, శ్రీధర్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 512.60 అడుగులు ఉంది. ఇది 136.12 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5598 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ 900, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 6498 క్యూసెక్కుల నీరు దిగువకు చేస్తున్నారు.

పులిచింతల..

అచ్చంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 21.94 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా మూడు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు.

రేషన్ షాపులో స్టాక్ బోర్డు తప్పనిసరి : తహసీల్దార్


డీలర్లకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ నగేష్

గురజాలటౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపులో డీలర్లు తప్పనిసరిగా స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ నగేష్ సూచించారు. మంగళవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన రేషన్‌డీలర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రతి డీలరు ఈపాసు, కాటా మిషన్ సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలించుకోవాలన్నారు. దివ్యాంగులకు ప్రతి నెలా 5వ తేదీలోపు వారి ఇంటి వద్దకు నిత్యావసర సరుకులు చేర్చాలన్నారు. ప్రతి రోజూ విధిగా స్టాక్ బోర్డులో ముగింపు నిల్వలు నమోదు చేయాలన్నారు. అలాగే షాపులో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఇద్దరి మధ్య ఘర్షణ..

● ఒకరిపై కేసు నమోదు

మాచవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడగా ఒకరిపై కేసు నమోదైన ఘటన మండలంలోని తురకపాలెంలో మంగళవారం జరిగింది. దీనికి సం బంధించి ఎస్ఐ రోశయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు పట్టణానికి చెందిన షేక్ సుభానీ తురకపాలెం గ్రామానికి చెందిన ఖాదర్‌వలి కుమార్తెను వివాహం చేసుకున్నాడు. సుభానీ గత ఆదివారం ద్విచక్ర వాహనంపై తురకపాలెం వస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన సైదావలి అతివేగంగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అంత వేగం ఎందుకు అని సుభానీ ప్రశ్నించటంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. సైదావలితో పాటు మరికొంత మంది సుభానీపై చేయి చేసుకున్నారు. సుభానీ ఫిర్యాదు మేరకు సైదావలితో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రోశయ్య తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు..

● తీవ్ర గాయాలు

నకరికల్లు, మే 27 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నరసరావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన లింగాల గోపీ, బొమ్మకంటి శివమణికంఠ సోమవారం రాత్రి కండ్లకుంటలోని తమ స్నేహితుల ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. తమ బైక్‌పై కండ్లకుంట నుంచి పమిడిపాడు వెళ్ళేందుకు బయలుదేరగా విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అతి వేగంతో ఎదురుగా వస్తున్న కారు గోపీ, శివ మణికంఠలను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో గోపీకి తలపైన, మోకాలిపైన తీవ్ర గాయాలయ్యాయి. శివ మణికంఠకు పెదాలు, భుజం, కంటి వద్ద గాయాలయ్యాయి. గాయపడ్డ వీరిద్దరిని నరసరావుపేటలోని ఒక ప్రైవేట్ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. గోపీ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారని పోలీసులు తెలిపారు. ఎస్ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాడలేని 'పల్లె వెలుగు'

● ఆటోల మీద ఆధార పడుతున్న ప్రయాణికులు
● గతంలో ప్రతి ఊరికి తిరిగిన బస్సులు



మాచవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): మాచవరం మండలంలోని అన్ని గ్రామాలకు గతంలో రోడ్డు రవాణా సంస్థ బస్సులు తిరిగాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఏడు గ్రామాలకు బస్సులు తిరగక కొన్ని సంవత్సరాలవుతుంది. ఆర్టీసీ అధికారులు బస్సుల సంఖ్య పెంచి ప్రయాణికులకు మెరుగైన రవాణా కల్పించాల్సి ఉండగా ఉన్న బస్సులనే తీసివేస్తూ ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇది ఆసరాగా చేసుకొని ఆటోవాలాలు విపరీతంగా చార్జీలు పెంచి ప్రయాణికులను దోచుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మాచవరం మండలంలో 15 గ్రామ పంచాయతీలు, రెండు శివారు గ్రామాలు ఉన్నాయి. 15 గ్రామ పంచాయతీల్లో కేవలం తొమ్మిది గ్రామ పంచాయతీలకే బస్సులు నడుస్తున్నాయి. అవి కూడా పూర్తి స్థాయిలో బస్సులు నడవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని అతి పెద్ద గ్రామమైన పిన్నెల్లికి నిన్న మొన్నటి వరకు ఆర్టీసీ బస్సు నడవ లేదు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పుణ్యమా అంటూ కొన్ని రోజుల నుంచి ఆర్టీసీ బస్సు వస్తుంది. ఇకపోతే శ్రీ రుక్మిణీపురం, సింగరాయపాలెం తండా, నాగేశ్వరపురం తండా, కొత్తపాలెం, రామచంద్రాపురం గ్రామాలకు కను చూపు మేరల్లో ఆర్టీసీ అధికారులు బస్సులు నడపటం లేదు. ఈ గ్రామాల ప్రజలు కేవలం ఆటోల మీద ఆధారపడి అధికార చార్జీలు పెట్టుకొని ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితులు దాపురించాయి. గతంలో పిడుగురాళ్ళ డిపో నుంచి చెన్నాయపాలెం మీదగా తంగెడ రేవు వరకు ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపారు. అంతేగాకుండా ఈ రూట్‌లో గతంలో మూడు సర్వీసులు నడిచేవి. ప్రస్తుతం రెండు సర్వీసులే నడుస్తున్నప్పటికీ అవి కూడా సమయానుకూలంగా నడవటం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కొత్తగణేషునిపాడు, పిల్లుట్ల, మోర్జంపాడు, గోవిందాపురం, మల్లవోలు గ్రామాలకు ఒకే బస్సు తిరుగుతుంది. పిడుగురాళ్ళ నుంచి గోవిందాపురం వెళ్లి వచ్చే వరకు ప్రయాణికులు వేచి చూడాల్సిన పరిస్థితి. ఇదే అదనుగా ఆటోవాలాలు ప్రయాణికులను ఎక్కించుకొని అధిక చార్జీలు వసూలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పిన్నెల్లి నుంచి గతంలో రామచంద్రాపురం వరకు ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసు నడిపారు. మొత్తం మీద మాచవరం మండలంలో బస్సు సర్వీసులు తక్కువగా నడుస్తున్నాయని, బస్సుల సంఖ్యను పెంచి ప్రయాణికులను సమయానుకూలంగా గమ్యస్థానాలకు చేరవేయాల్సిన అవసరం ఆర్టీసీ అధికారులపై ఉందని మండల ప్రజానీకం కోరుతుంది.

మా గ్రామానికి బస్సు ఏర్పాటు చేయండి

- పుల్లిబిల్లి రాధాకృష్ణ, శ్రీరుక్మిణీపురం



మా గ్రామానికి గతంలో ఆర్టీసీ బస్సు నడిపారు. కొన్ని సంవత్సరాల క్రితం తీసి వేశారు. బస్సు సర్వీ సులు లేక ఆటోల్లో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఆటో వాళ్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలి

బస్సు సర్వీస్ సమయాలు మార్చాలి

- చింతపల్లి సుభానీ, పిన్నెల్లి



పిన్నెల్లి గ్రామానికి ఉదయం 11, మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో బస్సు సర్వీసులు వస్తున్నాయి. దాని వల్ల ప్రయాణికులకు ఎలాంటి ఉపయోగం లేదు. ఉదయం 8, 9 గంటల సమయంలో, సాయంత్రం 4, 5 గంటల సమయంలో బస్సు సర్వీ సులు నడిస్తే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుం ది. ఆర్టీసీ వారికి ఆదాయం కూడా వస్తుంది. అధికారులు ఇది గమనించి బస్సు సర్వీసుల సమయపాలనలో మార్పులు తీసుకురావాలి.

బస్సుల సంఖ్య త్వరలో పెంచుతాం

- పిడుగురాళ్ళ డిపో మేనేజర్ కోటేశ్వరనాయక్

ప్రస్తుతానికి డిపోలో బస్సుల సంఖ్య తక్కువగా ఉన్నాయి. త్వరలో బస్సులు రాగానే అన్ని గ్రామా లకు బస్సులు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తాం పిన్నెల్లి గ్రామానికి ఏ ఏ సమయాల్లో బస్సుల అవసరం అవుతుందో రాత పూర్వకంగా గ్రామస్థులు రాసి ఇస్తే పరిశీలిస్తాం.

సత్రశాల ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా వెంకట శివయ్య

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి వెల్లడి


సత్రశాల ఆలయం


గుండా వెంకట శివయ్య

రెంటచింతల, మే 27 (ఆంధ్రజ్యోతి): పల్నాట అతిపురాతన క్షేత్రమైన సత్రశాలలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయ దేవస్థాన పాలకమండలి చైర్మన్‌గా ఆర్యవైశ్య వర్గానికి చెందిన గుండా వెంకట శివయ్యను(జెట్టిపాలెం) ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 26తో ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకునే గడువు పూర్తయిందని ఎవరైతే దరఖాస్తు చేశారో వారందరిని పాలక మండలి సభ్యులుగా ఎంపిక చేసినట్లు స్పష్టం చేశారు. పాలక మండలి సభ్యులుగా కంచనపల్లి బ్రహ్మయ్య, గుమ్మడిదల పుష్పావతి, దొడ్డా నారాయణ యాదవ్,మూఢావత్ అనంతరాములమ్మ, సురభి శైలజ, చింతా చంద్రశేఖరరెడ్డి, పోట్ల పద్మ, భువనగిరి అంజనేయ శాస్త్రితో పా టు అర్చకుడు శర్మ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా (ఉద్యోగ రీత్యా హోదా) వ్యవహరిస్తారన్నారు. వీరి పదవీ కాలం రెండు సంవత్సరాలుంటుందని వారిలో ఒకరిని ఉపాధ్యక్షుడిగా వారే ఎన్నుకుంటారన్నారు. నాలుగు బీసీలు, నాలుగు ఓసీలు, ఒకటి ఎస్టీలకు కేటాయించామని ఎమ్మెల్యే చెప్పారు.

ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే చర్యలు : ఎస్ఐ

మాచర్లటౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవని పట్టణ ఎస్ఐ సంధ్యారాణి యువకులను హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్డదిడ్డంగా వాహనాలను రోడ్డుపైనే పార్కు చేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వాహన చోదకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ బాలురు వాహనాలు నడపడం వంటివి ప్రమాదాలకు దారి తీస్తున్నాయని, మైనర్ల తల్లిదండ్రులు వాహనాలు ఇచ్చేటప్పుడు ఆలోచించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే ఆటో లు ఊరి బయటే పార్కింగ్ చేసుకొని సీరియల్ పద్ధతిలో వారికి కేటాయించిన స్టాండ్ల లో ప్రయాణికులను ఎక్కించుకోవాలని ఆటో వాలాలకు సూచించారు. అలాగే పట్టణంలో తిరిగే లోకల్ ఆటోలు ఎక్కడపడితే అక్కడ ఆపి పట్టణ ప్రజలకు ఇబ్బంది కలుగజేయకుండా వారికి అనుమతించిన స్థలాల్లోనే ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో మద్యం తాగి వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మహానాడుకు తరలి వెళ్లిన టీడీపీ శ్రేణులు


అమరావతి మండల టీడీపీ నాయకులు

అమరావతి, మే 27 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో జరిగే మహానాడు కార్యక్రమానికి మండల పరిధి గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మహానాడుకు వెళ్లిన వారిలో పార్టీలోని జిల్లా, మండల, గ్రామస్థాయి హోదాలో ఉన్న నాయకులు ఉన్నారు.

● బెల్లంకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ మండలం నుంచి టీడీపీ శ్రేణులు తరలి వెళ్లారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ ఆధ్వర్యంలో వాహనాల ద్వారా తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు గుడిసె కొండయ్య, మాజీ సర్పంచ్ హనుమంతరావు నాయక్, గంగిరెడ్డిపాలెం సర్పంచ్ ఆకుల జగన్ ఆయా గ్రామాల నుంచి టీడీపీ అనుచరులను మహానాడుకు తీసుకెళ్లారు.

● క్రోసూరు, మే 27(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ టీడీపీ నాయకులు కంచేటి సాయిబాబు, మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, మన్నెం శ్రీనివాసరావు, నలజాల కోటేశ్వరరావు, బండారు రాము, మహానాడు కార్యక్రమంలో సేవలు అందజేశారు.


క్రోసూరు మండలానికి చెందిన టీడీపీ నాయకులు

● పిడుగురాళ్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం మండలాల నుంచి మండల కన్వీనర్లు, పార్టీ ముఖ్యులు, మహిళలు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. మహానాడు ప్రాంగణంలో నమోదు కార్యక్రమం అనంతరం వేదిక వద్దకు చేరుకున్న నాయకులు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును కలిశారు. యువ నాయకుడు యరపతినేని నిఖిల్, పార్టీ శ్రేణులు పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కనిగిరి శ్రీను, సయ్యద్ అమీర్‌అలి, వడ్డవల్లి సాంబశివరావు, పణితి రవి, పిల్లి చెన్నారావు, నల్లపాటి నెహ్రూ, దియ్యా శ్రీనివాసరావు, రామకృష్ణ, ముప్పన వెంకటేశ్వర్లు, వల్లెపు రామకృష్ణ, నర్రా సాంబశివరావు తదితరులున్నారు.


మహానాడు ప్రాంగణంలో పిడుగురాళ్ల టీడీపీ నేతలు

● కారంపూడి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి టీడీపీ శ్రేణులు మంగళవారం వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరి, జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్, మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన బస్సులు, ప్రైవేటు వాహనాల్లో భారీగా కడపకు వెళ్లారు. మహానాడుకు వెళ్లినవారిలో వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, మండల మాజీ అధ్యక్షుడు చప్పిడి రాము, బొల్నేడి శ్రీనివాసరావు, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు బొల్నేడి కోటేశ్వరరావు, తెలుగుయువత మండల అధ్యక్షుడు తుపాకుల చిన రత్తయ్య, బీసీ సెల్ జిల్లా కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు, పట్టణ మాజీ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, షేక్ జానీబాషా, షేక్ నన్నేసా, తోట నరసింహారావు, బొల్నేడి హరికృష్ణ, దోర్నా ల బ్రహ్మారెడ్డి, నున్నా జనార్ధన్, మాజీ ఉప ఎంపీపీ చావా వీరాంజనేయులుతోపాటు 200 మంది దాకా ఉన్నారు.

అధికారికంగా ఎన్‌టీఆర్ జయంతి వేడుకలు

అమరావతి, మే 27(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి సంవత్సరం మే 28న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్‌టీఆర్ జయంతిని జరుపుకోవాలని జీవో జారీచేసిందని అంతర్జాతీయ పంచా యతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు తెలిపారు. ఎన్‌టీఆర్ జయంతి వేడుకల విషయమై తన వినతిని ప్రభుత్వం గౌరవించి అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి దుర్గేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందజేయాలి

● జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి పద్మావతి

రాజుపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది ఆస్పత్రిలో అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందజేయాలని జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పద్మావతి సూచించారు. మంగళవారం రాజుపాలెంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది హాజరు, మందుల నిల్వల రికార్డులు, రోగులకు అందజేస్తున్న సదుపాయాలను పరిశీలించారు. వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్, ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డ్ ఈకేవైసీ సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టి నూరుశాతం లక్ష్యాలు సాధించాలన్నారు. గర్భిణుల నమోదు వంటి వివరాలు పరిశీలించారు. వేసవిలో వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నందున తగిన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

యోగాపై ఇంటింటి ప్రచారం నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శివప్రసాద్

దుర్గి, మే 27 (ఆంధ్రజ్యోతి): యోగాపై గ్రామాల్లోని ప్రతి ఇంటికి తిరిగి ప్రచారం నిర్వహించాలని ఎంపీడీవో శివప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల ఉద్యోగులతో ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. జూన్ 21వ తేదీన యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉద్యోగులందరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించాలన్నారు. 18 నుంచి 60 సంవత్సరాలలోపు వారికి గ్రామ సచివాలయంలో ప్రతి రోజూ శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, గ్రామ సెక్రటరీలు, వీఆర్వోలు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యానికి మేలు

పిడుగురాళ్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా మాసోత్సవంలో భాగంగా మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో పట్టణ ప్రముఖులు, యోగా నిపుణులతో యోగ నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సుమారు 600 మందితో యోగా కార్యక్రమాన్ని గురూజీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ పీ శ్రీధర్, ఆయుష్ వైద్యాధికారి మేఘమాలతో పాటు పట్టణానికి చెందిన వందలాది మంది యోగ అభ్యాసకులు పాల్గొన్నారు.

యోగా మాసోత్సవంలో అధికారులు..


రాజుపాలెంలో యోగాసనాలు వేస్తున్న అధికారులు

రాజుపాలెం, మే 27(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం గ్రామంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక అధికారులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీవీ సత్యానారాయణ, తహసీల్దార్ దుర్గేశ్వరరావు, ఎంఈవో మల్లికార్జునశర్మ, ఏపీఎం శివకుమార్ తదితరులున్నారు.

రేషన్ డీలర్ల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ

రాజుపాలెం, మే 27(ఆంధ్రజ్యోతి): జూన్ 1వ తేదీ నుంచి రేషన్ డీలర్ల ద్వారానే నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ దుర్గేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడు తూ ఎండీయూ వాహనం ప్రభుత్వం రద్దు చేసినందున అందరూ రేషన్ షాపుల వద్ద సరుకులు తీసుకోవాలన్నారు. షాపు వద్ద ఉదయం 8 నుంచి 12వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 8గంటల లోపు నిర్ణీత షాపుల వద్దకు వెళ్లి నిత్యావసర సరుకులు తీసుకోవాలని చెప్పారు. దివ్యాంగులు, 65 సంవత్సరాలు పైబడిన వారికి డీలర్ ఇళ్లకు వచ్చి సరుకులు పంపిణీ చేస్తారన్నారు.

బాజీకి ఎమ్మెల్యే యరపతినేని అభినందనలు


పిడుగురాళ్ల నుంచి మహానాడుకు సైకిల్ యాత్ర నిర్వహించిన బాజీని అభినందిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు

పిడుగురాళ్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): కడప సమీపంలో నిర్వహిస్తున్న మహానాడుకు పిడుగురాళ్ల నుంచి సైకిల్ యాత్రగా వెళ్లిన బాజీని మంగళవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మహానాడు ప్రాంగణంలో అభినందించారు. వందలాది కిలోమీటర్లు సైకిల్ యాత్ర కొనసాగించి మహానాడుకు చేరుకున్న బాజీ గతంలో విజయవాడ, హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్టణం తదితర ప్రాంతాల్లో జరిగిన మహానాడు కార్యక్రమాలకు ఇదేవిధంగా హాజరుకావడం సంతోషమని యరపతినేని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంచేటి శివ, తదితరులున్నారు.

అమీన్‌పీర్ దర్గాను దర్శించిన యరపతినేని

పిడుగురాళ్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన కడపలోని అమీన్‌పీర్ దర్గాను మంగళవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దర్శించుకున్నారు. సంప్రదాయ రీతిలో కడప దర్గాలో ఎమ్మెల్యే యరపతినేని ప్రార్థనలు చేశారు. అక్కడి పెద్దలతో మాట్లాడారు. పల్నాడు ప్రాంతంలోని గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్లలో అతిపెద్ద ఈద్గా తన సొంత ఖర్చుతో నిర్మించిన విషయాన్ని వివరించడంతో పాటు ప్రతి ఏడాది మక్కా వెళ్లే వారికి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు తన సొంత నిధులు ఇచ్చి పంపుతున్న విషయాన్ని దర్గా పెద్దలకు తెలియజేయగా.. మాకు తెలిసినంత వరకు మక్కా వెళ్లే వారికి కొద్దో గొప్పో సాయం చేసే వారిని చూస్తున్నామని, ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఇచ్చి ఇప్పటికే 55 మందిని పంపించటం గొప్ప నిర్ణయమని, అల్లా నీవెంట ఉంటాడని దర్గా పెద్దలు దీవించారు. వీరి వెంట కడప అజ్మీరా దర్గా పెద్దలు, యరపతినేని నిఖిల్, తదితరులున్నారు.

మహానాడులో యరపతినేని నిఖిల్


మహానాడులో నాగార్జునసాగర్‌ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, యువ నాయకుడు యరపతినేని నిఖిల్ తదితరులు

పిడుగురాళ్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): కడప సమీపంలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాజరయ్యారు. నమోదు కార్యక్రమం అనంతరం పార్టీ నేతలతో కలిసి మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, కంచేటి శివ, యరపతినేని నిఖిల్, ఏఎంసీ చైర్మన్ తురకా వీర స్వామి, దియ్యా రామకృష్ణతో పాటు నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

మహానాడుకు హాజరైన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


మహానాడులో ఆశీనులైన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, భాష్యం రామకృష్ణ

పెదకూరపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి) : కడపలో మంగళవారం జరిగిన మహానాడులో తొలి రోజు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా మహానాడులో భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ కూడా పాల్గొన్నారు. అమరావతి, క్రోసూరు, పెదకూరపాడు, బెల్లంకొండ, అచ్చంపేట మండలాల నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

మహానాడులో పాల్గొనడం నా అదృష్టం

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి


మహానాడులో పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యుల సమక్షంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే జూలకంటి తెలిపారు. మహానాడు కార్యక్రమం మరింత స్ఫూర్తిని కలిగించిందని, తెలుగుదేశం పార్టీ కార్యకర్త నుంచి నాయకుల దాకా అందరికీ ఇది గొప్ప పండుగని పేర్కొన్నారు.


కడపలో జరిగిన మహానాడులో మంగళవారం సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సైబర్ నేరాలపై కిశోరీ బాలికలు అప్రమత్తంగా ఉండాలి

● అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వణుకూరి మాధవి

క్రోసూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రతపై కిశోరీ బాలికలు అప్రమత్తంగా ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వణుకూరి మాధవి అన్నారు. మంగళవారం మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరీ వికాసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. బాలికలు చాట్ చేస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని, చిరునామా, ఫోన్ నెంబరు, పాఠశాల, కళాశాల వివరాలు అపరిచితులతో షేర్ చేయవద్దన్నారు. కార్యక్రమంలో పలువురు కిశోరి బాలికలు పాల్గొన్నారు. అంగన్ వాడీ హెల్పర్లు, టీచర్లు పాల్గొన్నారు.

● అచ్చంపేట, మే 27 (ఆంధ్రజ్యోతి) : కిశోరి బాలికలు సైబర్ నేరాలు, ఆన్‌లైన్‌పై జాగ్రత్తలు తీసుకోవాలని క్రోసూరు ఐసీడీఎస్ సీడీపీవో సరళ అన్నారు. మంగళవారం వేల్పూరు, అచ్చంపేట గ్రామాల్లో కిశోరి వికాసం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కిశోరి బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్ మాణిక్యం, బలుసుపాటి త్రిపురసుందరి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.







మహానాడు సంబరం

కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.







కడప మహానాడులో సభ్యత్వం తీసుకుంటున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పిడికిలి బిగించి అభివాదం చేస్తున్న కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్



మహానాడు వేదికపై గుంటూరు పశ్చిమ, తాడికొండ ఎమ్మెల్యేలు గల్లా మాధవి, తెనాలి శ్రావణ్‌కుమార్, కనపర్తి శ్రీనివాసరావు

మహానాడులో మన నేతల సందడి



మహానాడు ప్రాంగణంలో గుంటూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ షేక్ సజీల



సభలో ప్రసంగిస్తున్న గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



మహానాడు ప్రాంగణంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, గుంటూరు కార్పొరేషన్ మేయర్ కోవెలమూడి రవీంద్ర



లోకేశ్‌తో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



మంత్రులు లోకేశ్, కొల్లు రవీంద్రతో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ



టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబుతో మంత్రి అనగాని సత్యప్రసాద్



వైద్య శిబిరంలో సిబ్బందికి సూచనలిస్తున్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



నియోజకవర్గ శ్రేణులతో కలిసి మహానాడుకు వస్తున్న చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



మహానాడు ప్రాంగణంలో గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజా మాస్టారు



గుంటూరు పార్లమెంట్ కేంద్రంలో సభ్యత్వ నమోదు తీసుకున్న పార్టీ శ్రేణులు



సభ్యత్వ నమోదు కోసం పల్నాడు పార్లమెంట్ కేంద్రం వద్ద బారులు తీరిన శ్రేణులు



సభ్యత్వ నమోదు కోసం బాపట్ల కేంద్రం వద్ద శ్రేణుల బారులు

1 నుంచి రేషన్ షాపుల వద్దే సరుకుల పంపిణీ: తహసీల్దార్

వినుకొండ టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): జూన్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతి రేషన్ షాపు తప్పనిసరిగా తెరిచి లబ్ధిదారులకు సేవలు అందించాలని వినుకొండ తహసీల్దార్ సురేష్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రేషన్ డీలర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 నుంచి 15వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 12గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8గంటల వరకు రేషన్‌షాపుల వద్ద డీలర్లు అందుబాటులో ఉండి సరుకులు అందించాలన్నారు.

పల్నాడు వార్తలు

♦ నరసరావుపేట ♦ వినుకొండ ♦ చిలకలూరిపేట

కౌలు రైతులకు సాగుదారు హక్కు పత్రాలిస్తాం: ఏఈవో

నూజెండ్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): భూయజమానుల హక్కులకు భంగం వాటిల్లకుండా కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలను ఇవ్వటం జరుగుతుందని ఏఈవో ఎలిషా అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో మంగళవారం పంట సాగు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో ఎలిషా మాట్లాడుతూ కౌలు రైతులు పంట సాగు హక్కు పత్రాలు తీసుకొనేందుకు భూయజమాని ఆధార్, మొబైల్ నెంబరుతో గ్రామ రెవెన్యూ అధికారి, రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో నాసర్ సాహెబ్, రైతులు పాల్గొన్నారు.



ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి

వైద్యశాలలో కాన్పులు పెరిగేలా చర్యలు తీసుకోవాలి: డీఎంహెచ్‌వో

నాదెండ్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి కాన్పుల సంఖ్య పెరిగేలా అవగాహన పెంచాలని జిల్లా విద్యాధికారి డాక్టర్ రవి అన్నారు. మండల కేంద్రమైన నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య కేంద్రంలోని వార్డులు, రక్త పరీక్షల కేంద్రం, శస్త్ర చికిత్సల గది, ఔషధ దుకాణాన్ని పరిశీలించారు. రోగులకు అందించాల్సిన సేవలపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట డాక్టర్ శ్వేత, డాక్టర్ జ్ఞానేశ్వరి, ఎంపీహెచ్ఎస్ దిలీప్ కుమార్, యూడీసీ హనుమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మద్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మద్యం షాపుల్లో సీఐ తనిఖీలు

ఈపూరు, మే 27(ఆంధ్రజ్యోతి): ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బొల్లాపల్లి, రేమిడిచర్ల గ్రామాలలోని మద్యం షాపులను సీఐ డీ వెంకటేశ్వర్లు బుధవారం తనిఖీ చేశారు. మద్యంను పరీక్షల నిమిత్తం శాంపిల్స్‌ను సేకరించారు. సమయపాలన సక్రమంగా ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించినా, అధిక ధరలకు మద్యం విక్రయించినా చర్యలు ఉంటాయన్నారు. తనిఖీలలో ఎస్ఐ కే శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతరాష్ట్ర తైక్వాండోలో ఎస్ఎస్ఎన్ విద్యార్థికి బంగారు పతకం

నరసరావుపేట టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో ఎన్‌టీఆర్ స్టేడియంలో జరిగిన అంతరాష్ట్ర తైక్వాండో ఇన్విటేషనల్ ఛాంపియన్‌షిప్-2025లో స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి వీ తులసీ తన్మయ్ బంగారుపతకం సాధించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ మంగళవారం తెలిపారు. బంగారు పతకం సాధించిన వీ తులసీ తన్మయ్‌ని కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకటప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాససాయి, పీడీ డాక్టర్ యక్కల మధుసూదనరావు, ఏవీఎస్ గుప్తా, వీ హరిప్రసాద్, తదితరులు అభినందించారు.

నేడు ఊడిజర్లలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ

ఈపూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊడిజర్లలో బుధవారం ఆలయంలో పోలేరమ్మ అమ్మవారి, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రతిష్ఠలో భాగంగా చండీయాగం, గ్రామ గవిటిరాళ్ళ నిర్మాణం చేపట్టారు. ప్రతిష్ఠ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు.

యోగాంధ్రాను విజయవంతంగా నిర్వహించాలి: ఎంపీడీవో

నూజెండ్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో పీ ఉమాదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం యోగా కార్యక్రమాల్లో పాల్గొనే ఔత్సాహికుల వివరాల నమోదు, యోగా కార్యక్రమాల ఏర్పాటు, నిర్వాహణ తదితర అంశాలపై ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ యోగాతో ప్రజలు ఆరోగ్య వంతులుగా ఉంటారని, ప్రతి ఒక్కరూ యోగా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనేలా చైతన్య పరచాలన్నారు.





గోతుల రోడ్లు.. వాహన చోదకుల అగచాట్లు...



గోతులమయంగా ఉన్న ఈపూరు-యర్రబాలెం రోడ్డు

- రూపురేఖలు మారిపోయిన తారురోడ్లు
- వర్షం పడితే తటాకాలను తలపిస్తున్న రహదారులు
- ప్రమాదాలబారిన ప్రయాణికులు
- కనీస మరమ్మతులు చేపట్టాలని ప్రజలు వేడుకోలు

ఈపూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): అడుగుకో గుంత.. గజానికో గొయ్యితో ఈపూరు-యర్రబాలెం, ఊడిజర్ల రోడ్డు దుస్థితి. సుమారు రెండు దశాబ్దాల క్రితం వేసిన తారురోడ్డు రూపురేఖలు లేకుండా పోయింది. రోడ్డుపై గోతులు పడడంతో తరచూ వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుచున్నారు. ఈ రోడ్డు నుంచి మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి గ్రామాలు, తండాల నుంచి వెళ్తుంటారు. వర్షం పడితే రోడ్డుపై గోతులలో నీరు చేరి తటాకాలను తలపిస్తున్నాయి. ఆ గోతులలో వాహనాలు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారుల దుస్థితిపై నాయకులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఉపయోగంలేదని లేకుండా పోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై దృష్టిసారించి రోడ్డు నిర్మాణం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుచున్నారు.



బురదమయంగా ఉన్న ఊడిజర్ల-యర్రబాలెం రోడ్డు

అడుగడుగునా గుంతలే...

వినుకొండ టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): పెదకంచర్ల నుంచి చినకంచర్లకు వెళ్లే ప్రధాన రహదారి రూపురేఖలు మారిపోయి అడుగడుగునా గుంతలమయంగా మారి వాహన చోదకులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ప్రజలు ఎదుర్కొంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్డు కావడంతో వైసీపీ ప్రభుత్వ హయాంలోని ఐదేళ్లల్లో ఆ రోడ్డుపై ద్విచక్రవాహనాలతో పాటు ట్రాక్టర్ల రాకపోకల కారణంగా రోడ్డుపై తారులేచిపోయి గులకమయంగా మారింది. గతంలో ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని చినకంచర్ల, పెదకంచర్ల గ్రామాలకు చెందిన ప్రజలు ప్రజా ప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రం ఇచ్చినప్పటికీ ఫలితం కనిపించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా రెండు గ్రామాల మధ్య ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.



గులక రోడ్డులా మారిన పెదకంచర్ల-చినకంచర్ల ప్రధాన రహదారి

సహకార సంఘాల అభివృద్ధిలో కమిటీ సభ్యులు, సీఈవోలది ముఖ్యపాత్ర

జిల్లా సహకార అధికారి ఎం.వెంకట రమణ

నరసరావుపేట టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల కమిటీ సభ్యులు, సీఈవోలు సహకార సంఘాల అభివృద్ధిలో ముఖ్యపాత్ర వహిస్తున్నారని జిల్లా సహకార అధికారి ఎం.వెంకట రమణ అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025 సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల కమిటీ సభ్యులు, కార్యనిర్వాహక కార్యదర్శులకు సామర్థ్య నిర్మాణం, సుపరిపాలనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నరసరావుపేట జీడీసీసీ బ్యాంక్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎం.వెంకట రమణ మాట్లాడుతూ సహకార సంఘాలు సభ్యుల సహకారంతో నడిచే స్వయంప్రతిపత్తి సంస్థలని, సంఘాల సమర్థవృద్ధికి కమిటీ సభ్యులు, సీఈవోలు తమ తమ పాత్రలు బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ విజయవాడ సహకార శిక్షణ కేంద్ర ప్రిన్సిపాల్ ఎస్.వేదాంతరెడ్డి మాట్లాడుతూ సంఘ కార్యకలపాల పర్యవేక్షణ, సరైన పాలనకు మార్గనిర్దేశం చేయడం కమిటీ సభ్యుల ముఖ్యవిధి అన్నారు. వార్షిక సాధారణ సభ, బడ్జెట్ ఆమోదం, ఆడిట్ నివేదికలకు ఆమోదం ఇవ్వడం కమిటీ బాధ్యతగా పేర్కొన్నారు. సభ్యుల సంక్షేమానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం, సంఘ నిధుల వినియోగంపై పర్యవేక్షణ కమిటీ చేయవలసి ఉందన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కమిటీ నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. సంఘం రోజువారీ పరిపాలనను కమిటీ సభ్యులు నిర్వహించాలని అన్నారు. సీఈవోలు కమిటీ నిర్ణయాలను అమలు చేయడం, సభ్యుల రికార్డులు, ఖాతాల నిర్వహణ, ప్రామాణిక పత్రాలను సమర్థంగా నిర్వహించడం చేయాలన్నారు. సంఘ ఆస్తులు, లావాదేవీల పర్యవేక్షణ కమిటీ సభ్యులతో పాటు సీఈవో కూడా బాధ్యత తీసుకోవాలని సూచించారు. సహకారరంగ అభివృద్ధికి కమిటీ సీఈవోలు ఒకదాని పనిని మరొకరు అర్థం చేసుకొని, పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇది సంఘాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి దోహదం చేస్తుందని అన్నారు. జిల్లాలో అన్ని సహకార సంఘాల ఈ పీఏసీఎస్‌లుగా మారి సభ్యులకు డిజిటల్ సేవలు అందిస్తున్నామని, దీనివల్ల సంఘాలలో పార దర్శకత పెరుగుతుందని చెప్పారు. కంప్యూటీకరణ మూలంగా సంఘాల ఆడిట్ సులభం అవుతుందని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జిలు, సంఘాల సీఈవోలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ, తదితరులు



పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్

ప్రధాన డ్రెయిన్లలో పూడికతీత ప్రారంభం

వినుకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలం నేపథ్యంలో పట్టణంలోని ప్రధాన డ్రెయినేజీల్లో మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యంలో మేజర్ డ్రెయినేజీలు డీసిల్టేషన్ చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. బీపీఎస్ 2019, ఎల్‌ఆర్ఎస్ 2020 నియామకాలకు లోబడి రాష్ట్ర ప్రభుత్వం పట్టణానికి కేటాయించిన 44.59 లక్షల నిధులతో పలు విడతలుగా కాలువ పూడికతీత పనులు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. పట్టణ ప్రజలకు ప్రధాన సమస్యగా ఉన్న అంబేద్కర్ కాలనీ, శృంగారపువనం, పల్నాడు రోడ్డులోని మెయిన్ డ్రెయినేజీ, డబ్బాబొమ్మ సెంటర్, కోట నాల్గా బజారు తదితర ప్రాంతాల్లో కాలువల్లో పూడిక తొలగింపు పనులు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పలు ప్రాంతాల్లో జరుగుతున్న పనులను మంగళవారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ఆయనతో పాటు మున్సిపల్ ఇంజనీర్ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

వినుకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక జూనియర్ కళాశాలతో పాటు లయోలా స్కూల్, సాయిబాబా గుడిలో జరుగుతున్న యోగా కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ మంగళవారం సందర్శించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, బీజేపీ నాయకుడు మేడం రమేష్‌తో పాటు యోగా గురువులు, మున్సిపల్ సిబ్బంది, యోగ సాధకులు పాల్గొన్నారు.

15 మంది కృష్ణవేణి విద్యార్థులు టీసీఎస్‌కు ఎంపిక

నరసరావుపేట టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు 15మంది టీసీఎస్ (ఐటీ)కి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. 2024-25 చివరి సంవత్సరం బీఎస్సీ విద్యార్థులకు టీసీఎస్ (ఐటీ) కంపెనీ ఫిబ్రవరి 14న క్యాంపస్ డ్రైవ్‌లో భాగంగా ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. అందులో అర్హత సాధించిన వారిని ఎప్రిల్ 14, 15 తేదీలలో ఫైనల్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ నెల 26న విడుదల చేసిన ఫలితాలలో 15 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు టీపీవో ఎం.బాలకోటేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులు

● మాజీ మంత్రి విడదల రజిని

నరసరావుపేట రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ వారిపై అక్రమ కేసులు పెడుతూ పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, అటువంటి వారిని చట్టం ముందు దోషులుగా నిలబెడతామని మాజీ మంత్రి విడదల రజిని హెచ్చరించారు. మంగళవారం పల్నాడు జిల్లా వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రజనీ మాట్లాడుతూ... పోలీసులు ఉద్యోగ ధర్మం పాటించాలన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని విస్మరించి వైసీపీ నేతలపై ఇష్టారాజ్యంగా కేసులు పెడితే ఎవరినీ వదిలి పెట్టమని హెచ్చరించారు. మాచర్ల నియోజకవర్గంలో జరిగిన టీడీపీ నాయకుల జంట హత్యల కేసులో పిన్నెల్లి బ్రదర్స్‌పై అన్యాయంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఒకే పార్టీలో ఆధిపత్య పోరు కోసం రెండు వర్గాల మధ్య జరిగిన జంట హత్యలని ఎస్పీ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి వ్యాఖ్యల అనంతరమే పిన్నెల్లి బ్రదర్స్‌ను కేసులో నిందితులుగా చేర్చారని మండిపడ్డారు. ఎఫ్ఐఆర్ నుంచి పిన్నెల్లి బ్రదర్స్‌ను తొలగించాలని లేనిపక్షంలో న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



ప్రతిభా పరీక్షలో ప్రథమ స్థానం సాధించిన బి యశస్వినికి రూ.50వేల స్కాలర్‌షిప్‌ను అందజేస్తున్న అతిథులు

యడ్లపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నెల రోజులపాటు నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. యడ్లపాడు జడ్పీ హైస్కూల్‌లో బాసట అధ్యక్షుడు నూతలపాటి కాళిదాసు అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో మహబూబ్ సుభానీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంఈవోలు నాగరత్నం, అరుణకుమారిలు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ప్రతిభ దాగి ఉంటుందని, సాధన ద్వారా దానిని వెలికితీయడం చాలా అవసరమన్నారు. ఎండోమెంట్ మాజీ డిప్యూటీ కమిషనర్ పోపూరి గంగయ్యచౌదరి, బాసట గౌరవ సలహాదారులు ఆలోకం పెదబ్బయ్యలు వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించడానికి సహకరించిన నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్ డైరెక్టర్ పోపూరి చిన్న, ప్రిన్సిపాల్ సీహెచ్ సృజనలకు కృతజ్ఞతలు తెలియచేశారు. శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన బాసట విద్యా విభాగం కమిటీ సభ్యులు కేతా రాంబ్రహ్మం, కల్లూరి వాసులను వక్తలు అభినందించారు. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి 22న బాసట నిర్వహించిన ప్రతిభా పరీక్షలో మొదటి ఐదు ర్యాంకులు సాధించిన విద్యార్థులు బి యశస్విని, ఎ గీతాలక్ష్మి, ఎస్ మేఘనశ్రీ, ఎస్ నాగఅజయ్‌బాబు, డి హారికలకు వరుసగా రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.11వేలు, రూ.9వేలు స్కాలర్‌షిప్‌ను, మరో ఐదుగురు విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతిగా ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున అందజేశారు. వివిధ అంశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులందరికీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాసట ప్రధానకార్యదర్శి సామినేని శ్రీనివాసరావు, సభ్యులు ముత్తవరపు రవీంద్రబాబు, రావూరి సుమాన్, పోపూరి శ్రీనివాసరావు, కోయ రామోజీరావు, ఉపాధ్యాయుడు రామిశెట్టి నాగేశ్వరరావు, మాజీ అధ్యాపకుడు శేషయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి: కలెక్టర్

నరసరావుపేట కల్చరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి యోగాంధ్ర యాప్ ద్వారా యోగా ఔత్సాహికుల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం అధికారులను ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమంపై ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 8లక్షల మంది యోగా ఔత్సాహికులను నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటికి లక్షమంది నమోదు పూర్తయ్యిందన్నారు. వీరితో పాటు 4,800 మంది మాస్టర్ ట్రైనర్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. బుధవారం ఉదయం 8 గంటలలోగా గ్రామ స్థాయిలో యోగా పోటీలు నిర్వహించాలన్నారు. గ్రామస్థాయిలో విజేతలకు జూన్ 2న మండల స్థాయిలో పోటీలు నిర్వహించాలన్నారు.

నేడు కోటప్పకొండలో యోగాంధ్ర

మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ వద్ద బుధవారం ఉదయం 6 గంటలకు జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. కాగా మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో యోగ శిక్షణ కార్యక్రమం కలెక్టర్ బంగ్లా వద్ద నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు ఇతర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో కొత్త మలుపు లోకేశ్ శాసనాలు

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రతిపాదించిన 6 శాసనాలు తెలుగు రాజకీయాల్లోనే కొత్త మలుపు అవుతాయని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అన్న స్ఫూర్తిని కొనసాగిస్తూనే తెలుగు జాతి, విశ్వఖ్యాతి, పేదల సేవలో- సోషల్ రీ ఇంజనీరింగ్, స్త్రీశక్తి, అన్నదాతకు అండగా, యువగళం, కార్యకర్తే అధినేత అన్న విధానాల ద్వారా రానున్న 40 ఏళ్లకు పార్టీ బలోపేతంపై ప్రతి ఒక్కరిలో నమ్మకం పెంచే ప్రయత్నం చేశారని అభినందించారు. తొలి రోజు కార్యక్రమంలో భాగంగా ఆయన నరసరావుపేట పార్లమెంట్ ప్రజా ప్రతినిధుల నమోదు కేంద్రంలో పేరును రిజిస్టర్ చేసుకున్నట్లు తెలిపారు. నాయకులు కార్యకర్తల కోసం ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శన ఆకట్టుకుందన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించి, అనంతరం మృతిచెందిన పార్టీ కార్యకర్తలకు, ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి నివాళి అర్పించారు.

మహానాడుకు వచ్చే వినుకొండ నాయకులకు ప్రత్యేక వసతి

వినుకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి వినుకొండ నుంచి వెళ్తున్న నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ వాహనాల్లో పులివెందుల మహానాడుకు విచ్చేయు కార్యకర్తలకు, నాయకులకు ఏదైనా సమస్యలు ఎదురైతే 9912343320, 9951505637, 9063006252 నంబర్లను సంప్రదించాలని ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్‌విప్ సూచించారు.





మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు, వర్క్ ఫ్రమ్ హోం నాటికలోని ఓ సన్నివేశం

సమాజాన్ని చైతన్య పరిచే నాటికలకు ఆదరణ

● హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు

నాదెండ్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని చైతన్య పరిచే నాటికలకు ఆదరణ పెరుగుతోందని హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని సాతులూరులో మూడు రోజులుగా జరుగుతున్న తృతీయ జాతీయ స్థాయి నాటిక పోటీల్లో మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గతంలో టీవీలు, సినిమాల కారణంగా రంగ స్థల కళాకారులకు ఆదరణ తగ్గిందన్నారు. ఇప్పుడిప్పుడే గ్రామీణ ప్రాంతాల్లో కూడా నాటికలకు ఆదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. రంగ స్థల కళాకారులను ప్రోత్సహించే విధంగా ఎన్‌టీఆర్ కళా పరిషత్ ఈ పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. వంటల తయారీలో నైపుణ్యం కలిగిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి... వంట రాని అమ్మాయిని అర్ధాంగిగా చేసుకొని పడ్డ కష్టాలను కళ్లకు కట్టిన వర్క్ ఫ్రమ్ హోమ్ నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. అలిగి అత్తారింటికి, చెడి చెల్లెలు ఇంటికి వెళ్లకూడదన్నట్లు.. కడపటి దశలో కన్న పిల్లల దగ్గరకు కూడా వెళ్ల కూడదనే సందేశాన్ని ఏకాకి అనే నాటిక అందించింది. ఈ సందర్భంగా రారాజు సుయోధన పౌరాణిక నాటిక విశేషంగా ఆకట్టుకున్నది. నడింపల్లి వెంకటేశ్వరరావు, గరికపాటి వెంకట రామారావు తదితరులు పాల్గొని బహుమతులు ప్రదానం చేశారు.

ఉత్తేజభరితంగా మహానాడు: ప్రత్తిపాటి


చిలకలూరిపేట, మే27 (ఆంధ్రజ్యోతి): తొలిరోజు మహానాడు ఆసాంతం ఉత్తేజభరితంగా జరిగిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప మహానాడు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన నరసరావుపేట పార్లమెంట్ స్టాల్ వద్ద ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ చేయించిన అనంతరం పార్టీ నాయకులతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొనని తెలిపారు. 43ఏళ్ల పార్టీ ప్రస్థానంలోని ముఖ్య ఘట్టాలను, ఎదుర్కొన్న సంక్షోభాలు, సవాళ్లు, కార్యకర్తల త్యాగాలను చంద్రబాబు వివరించిన తీరు పార్టీ కార్యకర్తల్ని అమితంగా ఆకట్టుకోవడమే గాక, ఆలోచింపచేసిందన్నారు. నా తెలుగు కుటుంబం పేరుతో లోకేశ్ ఆరు అంశాల గురించి చెప్పిన సందర్భం ఆకట్టుకుందన్నారు. పార్టీలో ఏ బాధ్యతలు అప్పగించినా తప్పక శిరసావహిస్తానని, కార్యకర్తలకు న్యాయం చేస్తానన్న లోకేశ్ వ్యాఖ్యలు ఆయన ఇమేజ్‌ను, ప్రతిష్ఠను మరింత పెంచాయన్నారు. మహానాడులో ప్రదర్శితమైన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయన్నారు. ఎన్టీఆర్ 102వ జయంతిని పురస్కరించుకొని వారికి హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నానని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో తెలిపారు.. ఆయన పాలన తెలుగుప్రజలకు స్వర్ణయుగమన్నారు.

మహానాడులో చురుగ్గా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడులో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, చదలవాడ సుధా రాజేశ్వరి దంపతులు మంగళవారం చురుకుగా పాల్గొన్నారు. మహానాడు మెడికల్ బ్లడ్ క్యాంప్ దగ్గర కార్యకర్తలకు, నాయకులకు అవసరమైన సాయం అందించారు. ఎమ్మెల్యే తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహానాడులో పార్టీకి కార్యకర్తలకు అనుసంధానంగా వ్యవహరిస్తూ ఎటువంటి లోపాలు లేకుండా మహనాడు దగ్గర కీలక పనులు చేస్తూ పార్టీలో చురుకైన కార్యకర్తగా సేవలు అందించారు. ఆయన వెంట మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పులిమి వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

వినుకొండటౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో అనారోగ్యంతో మృతిచెందిన ఓ అనాథ శవానికి టీడీపీ నాయకులు అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు. పువ్వాడ కృష్ణ, గుంటకల అంజి, బత్తుల శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో ఈ అంత్యక్రియలు జరిగాయి. వీరు చేస్తున్న సేవా కార్యక్రమాలను పట్టణంలోని పలువురు అభినందించారు.



అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తున్న టీడీపీ నాయకులు